

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ప్రియమైన శత్రువు

**"నాన్నా. దినేష్‌కి** మూడునెలలపాటు హెడాఫీస్‌లో ట్రైనింగ్ ఉందిట. ఈ సాయంత్రం డెన్మార్క్ వెళ్తున్నాడు. ఈ పిల్ల రాక్షసుడితో ఒక్కదాన్నే వేగలేను. నువ్వూ, అమ్మ వెంటనే టిక్కెట్లు కొనుక్కుని రండి." నీలిమ తండ్రితో ఫోన్‌లో చెప్పింది.

సురేంద్ర గలగలా నవ్వాడు.

"తక్షణం బయలుదేరడానికి అదేమైనా విజయవాడా? గుంటూరా తల్లీ! అమెరికా. ఎన్ని చూసుకోవాలి!?"

"అవన్నీ నాకు తెలీదు. మీరు రాకపోతే చాలాకష్టం. ఐనా నా కన్నా మీకు అక్కడి పనులు ఎక్కువా?" నిష్ఠూరంగా అడిగింది.

"కాదు తల్లీ. ఆఫీస్, సెలవులు చూసుకోవాలి కదా? అన్నట్లు వచ్చే నెల ఆడిటింగ్ ఉంది. నాకు కుదరదు. అమ్మ వస్తుందిలే."

"నేనొక్కదాన్నేనా?" పక్కనించి తల్లి కంఠం వినిపించింది.

"అమ్మ ఒక్కటే ఎలా వస్తుంది నాన్నా? తనకి అసలేం తెలీదుగా? ఇంట్లో ఒక్కదాన్ని వదిలి వర్క్‌కి ఎలా వెళ్తాను? పీసాఫ్ మైండ్ ఉండదు. ఇద్దరూ ఉంటే నాకు నిశ్చింత. నువ్వూ రావచ్చుగా?" నీలిమ అసహనంగా అడిగింది.

"ఆడిటింగ్ తల్లీ. అర్థం చేసుకో ఈసారికి అమ్మ వస్తుందిలే. లేదా సుశీలత్తని పంపమంటావా? తనకి వీసావుంది. టిక్కెట్ కొనిస్తే చాలు. దినేష్ వచ్చేదాకా ఉండి, తర్వాత వాళ్ళబ్బాయి ఇంటికి వెళ్ళి ఓ నెలవుండి వస్తుంది" సూచించాడు.

"బాబోయ్ నాన్నా. అమ్మనే పంపించు. నువ్వు లంచ్‌కి, డిన్నర్‌కి సుశీలత్త ఇంటికి వెళ్ళు. నేను అమ్మతో ఆవిడకి గిఫ్ట్లు పంపిస్తాలే." నీలిమ రాజీపడింది.

"సరే తల్లీ. ఇప్పుడే టిక్కెట్స్ చూస్తా" సురేంద్ర ఫోన్ పెట్టేసాడు.

అరగంట తర్వాత సురేంద్రనించి ఫోన్ వచ్చింది.

"నీలూ! రేపు రాత్రికే ఎమిరేట్స్‌లో టిక్కెట్ దొరికింది. ఎల్లుండి ఉదయం పదిగంటలకి షికాగో చేరుతుంది."

"వావ్! థాంక్స్ నాన్నా. అమ్మలేకపోతే నీకెంత ఇబ్బందో తెలుసుకానీ తప్పడంలేదు" సంజాయిషీగా చెప్పింది.

"ఫర్లేదమ్మా. అక్కడ చంటిపిల్లాడితో నువ్వొక్కదానివే పడే ఇబ్బందికన్నా నా ఇబ్బంది ఎక్కువేం కాదులే."

"నాన్నా. అమ్మ ఒక్కతే ఎప్పుడూ ప్రయాణం చేయలేదు. వీల్ చైర్ బుక్ చేసావా?"

"ఎందుకమ్మా! మీ అమ్మ డిగ్రీ చదివింది. ఇంగ్లీష్ మీడియం కూడా" సురేంద్ర పెద్దగా నవ్వాడు.

"సరే నాన్నా కనీసం రోమింగ్ ఉన్న ఫోనైనా ఇచ్చి పంపు" నీలిమ ఫోన్ పెట్టేసింది.

నీలిమ ఈ 'ఇంగ్లీష్ మీడియం' అన్నమాట తండ్రి నోటివెంట కొన్ని వందలసార్లు విన్నది. ఆకుచాటున మొగ్గలా తల్లి, తండ్రి చాటునే ఉండటం ఆయన వ్యంగ్యంగా మాట్లాడినా స్పందించకపోవడం చూసినప్పుడల్లా ఆశ్చర్యంగా ఉండేది.

"అమ్మా! ఇంగ్లీష్ మీడియంలో డిగ్రీ చదివావుగా. మరి జాబ్ ఎందుకు చేయలేదు?" చిన్నప్పుడు అడిగింది.

"నాన్న సంపాదించేది మనకి చాలు బంగారూ!" తల్లి మృదువుగా చెప్పింది.

"డబ్బుకి చాలు ఏమిటమ్మా. నువ్వూ జాబ్ చేస్తే ఇంకొంచెం క్వాలిటీ లైఫ్ ఉండేదిగా" నీలిమ అసంతృప్తిగా చెప్పింది.

కానీ పెద్దయ్యేకొద్దీ తండ్రి ఆలోచనా ధోరణి ఆమెకి అర్థమైంది. భార్యని ప్రేమిస్తాడు. కానీ ఒక పరిధిలోనే ఉంచుతాడు. ఆ పరిధిని ఉల్లంఘించింది అనే ఆలోచనరాగానే అలుగుతాడు. వారం పదిరోజులపాటు మాట్లాడేవాడు కాదు. తండ్రి 'నీలూ! అన్నం వడ్డించమ్మా' అనగానే ఆయన అలిగాడని అర్థమైపోయేది. దాంతో ఆయనకి ఎక్కడ కోపం వస్తుందో అని తల్లి ఆచితూచి మాట్లాడేది. కానీ ఆ మాటల్లో కొన్ని ఆయనకి కోపం తెప్పించేవి. అందుకే నీలిమకి తల్లి అంటే సానుభూతి.

"పోన్లే. ఈ వంకన మూడు నెలలు ప్రశాంతంగా ఉంటుంది" అనుకుంది.

ఏర్‌పోర్ట్‌లో తల్లికోసం చూస్తున్న నీలిమ, లగేజ్ ట్రాలీతో వస్తున్న నర్మదని చూసి గబగబా ముందుకి వెళ్ళి ట్రాలీని అందుకుంది.

"అమ్మా! దారిలో ఏ ఇబ్బంది కలగలేదుగా?" తల్లిని కౌగిలించుకుని అడిగింది.

"లేదు నాన్నా! అంతా సవ్యంగానే జరిగింది. నీల్ ఏడి?" నర్మద చుట్టూ చూస్తూ అడిగింది.

"డే కేర్‌లో ఉన్నాడమ్మా. నిన్ను ఇంటిదగ్గర దింపేసి నేనూ ఆఫీస్‌కి వెళ్ళాలి. ఈ రెండు రోజులు ఎంత ఇబ్బంది పెట్టాడనుకున్నావు? తృప్తిగా స్నానం కూడా చేయనివ్వలేదు" నీలిమ సూట్‌కేసులని కారు డిక్కీలో సర్దింది.

ఇంటికి చేరుకున్నాక సూట్‌కేసులని లోపలపెట్టి తల్లితో చెప్పింది.

"అమ్మా రాత్రే వంట చేసేసాను ఫ్రిజ్‌లో ఉన్నాయి. స్నానం చేసి వాటిని వేడి చేసుకుని తిను. తిన్నాక హాయిగా నిద్రపో. ఆరింటికల్లా వస్తాను. నాన్నకి ఫోన్ చేసి నువ్వు క్షేమంగా చేరావని చెప్తాలే"

సాయంత్రం ఇంటికి వచ్చాక చూస్తే ఇల్లంతా అద్దంలా వుంది. నర్మద స్నానం చేసి నైటీ వేసుకుని ఉంది. ఆమె వంటింట్లో బిజీగా వుంది.

"అమ్మా ఒక్క నిమిషం కూడా రెస్ట్ అక్కర్లేదా నీకు?" ప్రేమగా కసిరింది.

"అమ్మమ్మా" అంటూ వచ్చిన మనవడ్ని ఎత్తుకుంటూ చెప్పింది నర్మద.

"నాకేం అలసటలేదు నీలూ. ఇల్లంతా అరణ్యంలా ఉంది. వీడితో నువ్వు చేసుకోలేవని పైపైన సర్దాను అంతే. ఇంకాస్త వివరంగా సర్దాలి తర్వాత."

"నీ చేతి వంట అమృతం అమ్మా!" ఆ రాత్రి అన్నం తింటూ చెప్పింది నీలిమ.

"నీలూ రేపటినించి వీడిని ఇంట్లో వదిలి వెళ్తావా?" మనవడికి అన్నం తినిపిస్తూ అడిగింది నర్మద.

"ఎందుకు? వీడిని భరించడం నీవల్లకాదు. దినేష్ మరీమరీ చెప్పాడు డేకేర్ మాన్పించవద్దని. తీసుకెళ్తాను" తలెత్తి చిన్నబుచ్చుకున్న తల్లితో ప్రేమగా చెప్పింది. "అమ్మా! హాయిగా రెస్ట్ తీసుకో. నీ పెళ్ళయిన ఈ ముప్పై ఏళ్ళలో నువ్వు నాన్నని వదిలి పదిరోజులు కూడా దూరంగా ఉండలేదు. ఎక్కడికైనా ఇద్దరూ వెళ్తారు. కానీ ఈ దూరం నీకు చాలా అవసరం. ఈ మూడు నెలలు కొంచెం సుఖపడు"

నర్మద ఏమీ మాట్లాడలేదు.

"అమ్మా! నీ ఫోన్‌కి రోమింగ్ ఉంది కదా? నాన్నతో మాట్లాడావా?" నీలిమ అడిగింది.

"నాకసలు ఫోనే లేదు" నర్మద నవ్వింది.

"వ్వాట్? అప్పుడు ఉండేది కదా? నాకు లేండ్ లైన్‌కి చేయడం అలవాటు కదా తెలియలేదు నాకు. ఇదివరకటి నంబర్ ఏమైంది?" ఆశ్చర్యంగా అడిగింది.

"ఓసారి నాన్న నాకు ఫోన్ చేస్తే ఎంగేజ్డ్ వచ్చిందిట. అమ్మమ్మతో మాట్లాడుతున్నాను. దాంతో కోపం వచ్చి 'నాకు ఉపయోగపడని ఫోన్ ఎందుకు?' అని కనెక్షన్ తీసేసారు" నర్మద నిర్వికారంగా చెప్పింది.

"దారుణం అమ్మా. నువ్వెలా భరిస్తున్నావ్?" కోపంతో నీలిమ పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"ఫోన్ కంటే ముఖ్యమైనవి కొన్ని వుంటాయ్ నీలూ."

"నేను వాట్సాప్‌లో నీల్ ఫొటోలు, వీడియోలు పంపినప్పుడు నాన్నే రెస్పాండ్ అయేవారు. నువ్వు పట్టించుకోవు అనుకునేదాన్ని."

"నాకు చూపించేవారు నీలూ. అన్నీ చూసాను" నవ్వింది.

నీలిమకి పట్టలేనంత ఉక్రోషంగా ఉంది. ఈ నియంతృత్వం ఏమిటి? తనమీద అంత ప్రేమ ఉన్న నాన్న అమ్మనెందుకు పాపం అంత హింసిస్తాడు?

"అమ్మా నీకు ఫేస్‌బుక్ ఎకౌంట్ కూడా లేదా? లేక లేప్‌టాప్‌లో చూసుకుంటావా?" అడిగింది.

"ఆ ఫోన్ ఉన్నప్పుడు అందులో ఉండేది. ప్రస్తుతం లేదు. ఐనా అప్పుడు నాన్న రోజూ నా ఫోన్ తీసుకుని నా మెసేజెస్, ఫేస్‌బుక్ అప్‌డేట్స్ చూసేవారు. అందుకని పెద్దగా బాధలేదు ఇప్పుడు లేదని."

"వ్వాట్?" నీలిమ మరోసారి ఆశ్చర్యపోయింది.

"అదేంటమ్మా? నీకు ప్రైవసీ ఉండద్దా? మరి నాన్న మెసేజెస్ నువ్వు చెక్ చేస్తావా?"

"ఛ!" నర్మద కంపరంగా చెప్పింది. తర్వాత నవ్వుతూ చెప్పింది.

"చూద్దామన్నా నాన్న ఫోన్ పాస్‌కోడ్ నాకు తెలీదు."

నీలిమకి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

"పాపం అమ్మ పంజరంలో పక్షి" అనుకుంది.

"నీలూ నాకు పెయింట్ బ్రష్‌లు, కలర్స్ తెచ్చిస్తావా?" నర్మద మర్నాడు కూతుర్ని అడిగింది.

"ఓకే నా డ్రెస్‌ల మీద కూడా పెయింట్ చేస్తావా అమ్మా?" నీలిమ అడిగింది.

"ఫేబ్రిక్ పెయింట్స్ కాదు నీలూ. ఈజిల్, కేన్వాస్..."

"ఓ! నువ్వు బొమ్మలు గీస్తావా అమ్మా?" నీలిమ దిగ్భ్రాంతిగా అడిగింది.

"గీసేదాన్ని. మరి ఇప్పుడు కుదురుతుందో లేదో చూడాలి. పగలంతా ఒక్కదాన్నే ఉంటాగా తోచదు."

"నాకు వాటి గురించి తెలీదమ్మా. సాయంత్రం నిన్ను షాప్‌కి తీసుకెళ్తా. ఏం కావాలో నువ్వే కొనుక్కో. సరేనా!" నీలిమ వెళ్ళిపోయింది.

ఆ సాయంత్రం నర్మద తనకి కావల్సిన పెయింటింగ్ సామగ్రి, బ్రష్‌లు కొనుక్కుంది. ఆమెకి ఆ షాపింగ్ చాలా సరదాగా ఉంది. కొన్ని ఫేబ్రిక్ పెయింట్స్ కూడా కొన్నది.

"నీ పాత కుర్తా ఒకటివ్వు ప్రయోగం చేస్తా" చెప్పింది.

రెండు రోజుల తర్వాత నీలిమ తల్లికి ఓ ఫోన్ ఇచ్చి చెప్పింది.

"అమ్మా నీకోసం కొన్నాను. హాయిగా వాడుకో. ఎవరితోనైనా మాట్లాడుకో. వాట్సప్, ఫేస్‌బుక్ అకౌంట్స్ ఓపెన్ చేసుకో. బట్. నాన్నని జాయిన్ చేసుకోకు" నవ్వింది.

నర్మద దాన్నందుకుని చూసి చెప్పింది.

"భలే వుంది నీలూ. థాంక్స్. కానీ ఇండియా వెళ్ళేప్పుడు ఇక్కడే వదిలి వెళ్తాను."

వారం తర్వాత తల్లి పూర్తి చేసిన పెయింటింగ్‌ని చూసి నీలిమ ఆశ్చర్యపోయింది. నీల్ బొమ్మల మధ్య కూర్చుని ఆడుకుంటున్న పెయింటింగ్ అది.

"వావ్! అమ్మా! ఫోటోలా గీసావు తెలుసా? ప్రొఫెషనల్స్ గీసినట్లుంది కానీ నువ్వు గీసినట్లు లేదు."

దాన్ని ఫోటో తీసి దినేష్‌కి, తన ఫ్రెండ్స్‌కి పంపింది. కుర్తామీద వేసిన రాధాకృష్ణుల బొమ్మ కూడా ఆమెకి అమితంగా నచ్చింది.

"నీలో ఇంత టాలెంట్ ఉంది కదా? నాన్నెందుకమ్మా నిన్ను ప్రోత్సహించలేదు?" అడిగింది.

నర్మద చిరునవ్వు నవ్వింది కానీ సమాధానం చెప్పలేదు.

"నీలూ! మిల్వాకీ మనకి దగ్గరేనా?" నర్మద సంకోచంగా అడిగింది.

"దగ్గరే ఎందుకు? అక్కడెవరైనా ఫ్రెండ్స్ ఉన్నారా?" నీలిమ అడిగింది.

"అవును. దగ్గరైతే ఓ వీకెండ్ వెళ్ళొద్దామా?"

"ఈ వీకెండే వెళ్దాం. రాత్రికి ఉండక్కర్లేదు. రెండు గంటల ప్రయాణం. పొద్దున వెళ్ళి రాత్రికి రావచ్చు." నీలిమ అంగీకరించింది.

శనివారం పొద్దున్నే బయలుదేరారు. కారులో ఇంగ్లీష్ పాట వస్తోంది.

"నీలూ. కభీ కభీ మేరే దిల్ మే.. పాట పెడతావా?" నర్మద అడిగింది.

"ఓ! నీకు హిందీ పాటలు కూడా తెలుసా? నిజానికి నీ గురించి నాకేం తెలీదమ్మా. నువ్వు బాగా ఇల్లు సర్దుతావని, బాగా వంట చేస్తావని మాత్రమే తెలుసు" పశ్చాత్తాపంగా చెప్పింది.

నర్మద ఆ పాటతో స్వరం కలిపి పాడుతూంటే నీలిమ నిశ్శబ్దంగా విన్నది.

తర్వాత నర్మద తన కిష్టమైన హిందీ తెలుగు పాటలు పెట్టుకుని వాటితో గొంతు కలిపి పాడసాగింది.

తల్లి మొహంలోని ఆనందాన్ని చూసిన నీలిమ 'అమ్మ పంజరం వదిలిన పక్షి'లా వుంది అనుకుంది.

"ఆవిడ ఏం చేస్తుందమ్మా?" జి.పి.ఎస్‌లో దారి చూస్తూ అడిగింది.

"ఏవిడ?"

"అదే ఈ ఉదయశంకర్ గారి వైఫ్."

"ఏమో నాకేం తెలుసు?"

"ఏమోనా? మనం వెళ్ళేది ఆవిడని చూడడానికి కాదా?"

"కాదు ఉదయ్‌ని చూడడానికి. నా ఫ్రెండ్ ఉదయ్. వాళ్ళావిడకాదు."

"ఓ! నీలో ఈ కోణం కూడా ఉందా?" నీలిమ నవ్వింది.

"అవును. కానీ కేవలం స్నేహితుడే మంచి మిత్రుడు" నర్మద కూడా నవ్వి చెప్పింది.

ఆ ఇంటి బెల్ కొట్టగానే నర్మద వయసే ఉన్న ఒకతను వచ్చి తలుపు తీసాడు.

"రాజహంసా! స్వాగతం" అభిమానంగా ఆహ్వానించాడు.

"రాజహంసా? మళ్ళీ ఈ ట్విస్ట్ ఏమిటి?" నీలిమ ఆశ్చర్యంగా అడిగింది.

"ఇందులో ట్విస్ట్‌లేం లేవు. మా కాలేజ్‌లో మా కుర్రాళ్ళు నర్మదకి పెట్టుకున్న ముద్దు పేరు రాజహంస" ఉదయ్ నవ్వుతూ చెప్పాడు.

ఆ రోజంతా సరదాగా గడిచిపోయింది. ఆ సంభాషణల్లో తల్లి చిత్రకారిణిగా శిక్షణ పొందిందని, కర్ణాటక సంగీతం నేర్చుకుందని, భరతనాట్యంలో ఆమెకి ప్రవేశం ఉందని తెలుసుకున్న నీలిమ ఇంతవరకు తల్లి గురించి తనకి పూర్తిగా తెలీదని సిగ్గుపడింది.

"చాలా థాంక్స్ నీలూ. నువ్వు మళ్ళీ ఫేస్‌బుక్ అకౌంట్ క్రియేట్ చేయడం వల్ల ఉదయ్‌ని కలుసుకోగలిగాను. డిగ్రీలో మేమిద్దరం పోటీపడి చదివేవాళ్ళం. మళ్ళీ ఎన్నేళ్ళకో నీ పుణ్యమా అని కలిసాం" తిరిగి వచ్చేప్పుడు నర్మద కృతజ్ఞతగా చెప్పింది.

"అమ్మా! నీ గురించి చాలా తెలుసుకోవాలి. ఇక నిర్భాంతపోలేను" నీలిమ చెప్పింది.

"అమ్మా! నీ దగ్గర పడుకుంటాను ఈరోజు" నీలిమ తల్లి గదిలోకి వచ్చి చెప్పింది. సెల్‌ఫోన్‌లో ఏదో పుస్తకం చదువుకుంటున్న నర్మద పక్కకి జరిగి చెప్పింది "రా"

"అమ్మా ఈ సస్పెన్స్ ఇక నావల్ల కాదు. నీలో ఇన్ని టేలంట్స్ వున్నా, నాన్న ఎందుకు పట్టించుకోలేదు? నువ్వెందుకు ఆయన్ని ఎదిరించి బయటికి పోలేదు? నువ్వేకాదు. అమ్మమ్మ, మామయ్యకూడా నాకేం చెప్పలేదు. ఇంతకాలం నువ్వొక సత్తెకాలం మనిషివని అనుకున్నా కాని ఇంత వ్యక్తిత్వం ఉన్న మనిషివని అనుకోలేదు" నీలిమ తల్లి చుట్టూ చెయ్యివేసి దగ్గరగా పడుకుని అడిగింది.

"చాలా చిన్నకథ నీలూ. బాగా చదువుకున్నాను. బియస్సీలో కాలేజ్ టాపర్‌ని. సంగీతం, చిత్రలేఖనంలాంటి వన్నీ నేర్చుకున్నాను. మీ నాన్నతో పెళ్ళయింది. ఆయన మంచివాడే కానీ ఆయనకి ఒక అభద్రతా భావం ఉంది. దాన్ని నేను మొదట్లో పసిగట్టలేకపోయాను. ఓసారి ఆయన ఏదో ఇంగ్లీష్ వాక్యం తప్పుగా మాట్లాడారు. నేను కిసుక్కున నవ్వాను. ఆయన మొహం కోపంతో ఎర్రబడింది. 'ఎందుకు నవ్వావు?' అని అడిగారు. నేను ఆయన చేసిన గ్రామర్ తప్పుని వివరించాను. అదోలా చూసి 'ఓహ్! తమరు ఇంగ్లీష్ మీడియం డిగ్రీ కదూ' అన్నారు. ఆ తర్వాత నెలరోజులు నాతో మాట్లాడలేదు. చిన్నపిల్లని. చాలా ఏడ్చి బతిమాలాను. పలకలేదు. తర్వాత చూసిపోదామని వాళ్ళ తరఫు బంధువులెవరో వచ్చారు. ఇక మాట్లాడక తప్పలేదు. నా చదువు, కళల్లో ప్రతిభగురించి మా నాన్న చాలా ఎక్కువగా వర్ణించి చెప్పారు. సురేంద్రలో అలాంటివి ఏమీ లేవు. పెళ్ళికి వచ్చిన వాళ్ళు 'కాకి ముక్కుకి దొండపండు' అనడం పీటల మీదున్న ఇద్దరం విన్నాం. నేను విననట్లు నటించాను. ఆయన అది మర్చిపోలేదు. నేను ఎవరితోనైనా వెళ్ళిపోతానేమో లేదా పుట్టింటికి పోతానేమో అనే ఇన్‌సెక్యూరిటీ తనలో బలంగా ఏర్పడింది. దాంతో నన్ను చిన్నబుచ్చడం, పదిమందిలో చులకనగా మాట్లాడటం, ఎగతాళి

చేయడం మొదలుపెట్టారు. అది నాకెంతో నరకంలా ఉండేది. భార్యలోని క్వాలిటీలని చూసి మెచ్చుకునేవాళ్ళు, ప్రోత్సహించే భర్తలు చాలామంది తెలుసు నాకు. చిన్న విషయాలకి కూడా భార్యలని పొగిడేవాళ్ళనీ చూసాను. కానీ సురేంద్ర ఈరోజు వరకూ నన్ను ఏ ఒక్క విషయంలో కూడా మెచ్చుకోలేదు. నేనంటే అభిమానం ఉంది. కానీ ఆయన నా ఉనికిని సహించలేరు. నాముందు తనో అల్పజీవి అని ఫీలవుతారు. దాంతో నేనే తగ్గాను. భర్త చాటు భార్యనయ్యాను. ఆయన ఏమన్నా తలూపాను. ఐనా అలకలు, కొట్లాటలు మానలేదు. ఇక్కడికి రావడానికి వారం ముందు కూడా ఏదో చిన్న విషయానికి వారంపాటు అలిగారు. నేను ఓ ఆర్టిస్ట్, ఓ సింగర్ అనిపించుకునే కంటే, ఓ భార్యగా ప్రశాంతంగా బ్రతకడాన్ని ఇష్టపడతాను. అమ్మమ్మ వాళ్ళకి కూడా ఈ కలహాల కాపురం గురించి తెలుసు. అందుకే నిశ్శబ్ధంగా ఉంటారు. ఏం చేస్తాం? కొన్ని జీవితాలింతే" నర్మద నిట్టూర్చింది.

"నువ్వు విడాకులు తీసుకుని వెళ్ళిపోవాల్సింది."

"మీ నాన్న ఈ ముప్పై ఏళ్ళుగా అదే భయపడుతున్నారు. అనవసర భయం. దాన్ని నిజం చేయమంటావా? సరే. తర్వాత? ఏం చెయ్యాలి? అప్పటికే నువ్వు పుట్టేసావు. నిన్నేం చేయాలి?"

నీలిమకి ఏం చెప్పాలో తోచలేదు.

"కొన్ని జీవితాలింతే అని చెప్పాగా. పడుకో. ఈ మధ్య నాన్న భయం కాస్త తగ్గిందిలే. నన్ను వంటరిగా పంపారుగా" నర్మద నవ్వుతూ చెప్పింది.

"అమ్మా. దినేష్ వచ్చాక నువ్వు మళ్ళీ ఇల్లాలి పాత్రలోకి వెళ్ళిపోతావు కదా? నీ ఈజిల్, పెయింట్స్, సంగీతం, సెల్‌ఫోన్ అన్నీ వదిలేసి, సీతాకోక చిలక మళ్ళీ ప్యూపాదశకి వెళ్ళినట్లుగా ముడుచుకుపోతావు కదా?" నీలిమ దిగులుగా అడిగింది.

"తప్పదుగా!" నర్మద నిట్టూర్చింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments